క్లుప్తంగా

'అధిక వేతనం పొందేలా పనిచేయాలి'



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

కొత్తూరు: ఉపాధి వేతనదారులు అధిక వేతనం పొందేలా పనులు చేయాలని ఎంపీడీవీ పి.త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని కడుము గ్రామంలో ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు ప్రకారం పనులు చేసినప్పుడు రోజుకు రూ.300 వరకు వేతనం పొందవచ్చన్నారు. పనులు వద్ద తాగునీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. తప్పుడు మస్టర్లు వేసినట్లయితే సహించేది లేదని ఉపాధి సిబ్బందికి హెచ్చరించారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాకానుక పంపిణీ



సమీక్షలో మాట్లాడుతున్న ఎంఈవో రామరాజు

పొందూరు: జగనన్న విద్యా కానుక పంపిణీ ప్రణాళికాబద్ధంగా జరగాలని ఎంఈవోలు పీవీ రామరాజు, పి.రాజారావు, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి పి.జనార్దనరావు అన్నారు. మండలంలో విద్యా కానుకల పంపిణీపై సోమవారం ఎమ్మార్సీలో సమీక్ష నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. విద్యా కానుకల పంపిణీలో భాగంగా ఒక్కో విభాగానికి సీఆర్ఎంటీ, పీటీఐ, ఐఈఆర్టీతో కూడిన టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. టీమ్‌లకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



వేసవి దుక్కులు చేస్తున్న దృశ్యం

హిరమండలం: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు వేసవి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి సంధ్య సూచించారు. వాతావరణ శాఖ అధికారుల సూచనల ప్రకారం ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని, జూన్ మొదటి వారంలో రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. రైతులు వేసవి దుక్కులు దున్నుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో చల్లుకుని 40 రోజుల తర్వాత సగంపూత దశలో భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు.

పొన్నాంపేటలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: మండలంలోని పొన్నాంపేట గ్రామంలో పరిసరాల పరిశుభ్రతలో భాగంగా సోమవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. గ్రామంలో మురుగు కాలువల్లో పూడికలు నిండిపోవడంతో చెత్తను, పూడికలను తొలగింపులు చేసి బ్లీచింగ్ జల్లారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవలని సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శేష వాహన సేవ



శేష వాహన సేవలో స్వామివారు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శేష వాహన సేవ నిర్వహించారు. శేష వాహనంపై స్వామివారి తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ఇళ్ల ముందు మహిళలు ముగ్గులు వేసి తమ భక్తి చాటారు. పెద్దపేటతో పాటు ప్రధాన వీధుల్లో తిరువీధి చేపట్టారు.

ఊపందుకున్న ఉపాధి



జమ్ము వద్ద చెరువులో పనిచేస్తున్న వేతనదారులు

- నియోజకవర్గంలో 38,021 మందికి పనులు
- వేతనదారులకు కల్పించిన పనుల సంఖ్య 308
- గరిష్ట కూలీ రూ.300లకు పెంపు

మండలం	వేతనదారులు	జాబ్ కార్డులు	పనులు సంఖ్య
నరసన్నపేట	8,799	9,774	73
జలుమూరు	10,058	11,607	68
పోలాకి	10,458	13,290	85
సారవకోట	8,706	9,097	82

నరసన్నపేట: నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులకు విరామం కావడంతో, ఉపాధి పనులు వేతనదారులకు కల్పతరువు అయ్యాయి. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీకి పనులు కల్పిస్తున్నారు. సకాలంలో వేతన బకాయిలు అందుతుండడంతో పనుల్లో పాల్గొనే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో ఉపాధి పనులు కల్పించడంలో జిల్లాలో ముందు వరుసలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు ఉన్నాయి. 139 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. 43,768 జాబు కార్డులు ఉండగా, 38,021 మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారు. సోమవారం నాటికి 308 పనులు జరుగుతున్నాయి. ప్రతీ వేతనదారుడికీ వంద రోజుల పని దినాలు కల్పిస్తున్నారు. వేసవిలో ఉపాధి పనులు కల్పించడంపై వేతనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా చెరువులు, కాలువల్లో అధికంగా పనులు చేస్తున్నారు.

గరిష్ట కూలీ రూ.300లకు పెంపు

కాగా 2024/25 ఆర్థిక సంవత్సరానికి వేతనదారులకు గరిష్ట కూలీ రూ.300 లకు ప్రభుత్వం పెంచింది. గతేడాది రూ.272 గరిష్ట వేతనం ఉండేది. దీంతో ప్రతీ వేతనదారుడికీ పనిని బట్టి వేతనం లభిస్తోంది. వేతనదారులు సరాసరి ప్రస్తుతం రూ.270లు వేతనం పొందుతున్నారు. ఈ గరిష్ట వేతనం రూ.300 పొందేలా డ్వామా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

అందరికీ పనులు



మండలంలో పని కావాలని అడిగిన ప్రతీ ఒక్కరికీ పనులు కల్పిస్తున్నాం. వేతనదారులు కూడా ఉత్సాహంగా పనులకు వస్తున్నారు. మే నెల మొదటి వారంలో 7 వేల మంది వేతనదారులు పనులకు హాజరవుతుండగా, ఈ సంఖ్య ఇప్పుడు బాగా పెరిగింది. ఇప్పుడు గరిష్ట వేతనం రూ.300 పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే పనుల వద్ద నీడ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్న మేరకు టెంట్లు వేస్తున్నాం. లేని గ్రామాల్లో కొబ్బరి, తాటి కమ్మలతో పందిర్లు వేయమని ఆదేశాలు ఇచ్చాం. ప్రస్తుతానికి పనులు చురుకుగా జరుగుతున్నాయి.

– యుగంధర్, నరసన్నపేట ఏపీఓ

ఉన్న ఊళ్లోనే పని



ప్రస్తుతం మా పరిసరాల్లోనే ఉపాధి పని లభిస్తోంది. రోజుకూలీ రూ.250 వరకూ వస్తుంది. సంతోషంగా ఉంది. డబ్బులు కూడా పెండింగ్ లేక సకాలంలో వస్తున్నాయి. గడిచిన ఐదేళ్లుగా పనులకు వెళ్తున్నాను. పని ప్రదేశంలో జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

– లబ్బ సుందరమ్మ, కోమర్తి

నెలకు రూ.6 వేల ఆదాయం



ఉపాధి పనులు సంతృప్తి స్థాయిలో కల్పిస్తున్నారు. నెలకు సరాసరి రూ.6 వేల వరకూ ఆదాయం వస్తోంది. సొంత పొలం పనులతో పాటు ఇంటి పనులు చూసుకుంటూ ఉపాధి పనులకు వెళ్తున్నాం. ఆనందంగా ఉంది.

– లక్ష్మీనారాయణ, కరగాం

నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనం



నిరుపయోగంగా ఉన్న భవనం

సరుబుజ్జిలి: మండలంలోని సుబ్బపేట అంగన్‌వాడీ కేంద్రం భవనం ప్రైవేటు వ్యక్తులు తమ అవసరాలకు వినియోగిస్తున్నారు. గతంలో ఈ భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ నిధులు మంజూరుకాక పనులు నిలిపేశారు. దీంతో గ్రామస్తులు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు నిల్వచేయడానికి వాడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం మాత్రం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రక్షణ గోడ నిర్మించాలి



సరుబుజ్జిలి: కూలిన రహదారి రక్షణ గోడ



ఆమదాలవలస రూరల్: రక్షణ గోడ లేని నైర ఛానల్ సాగునీటి కాలువ వంతెన

ఆమదాలవలస రూరల్: మండలంలోని చెవ్వాకులపేట గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న నైర ఛానల్ సాగునీటి కాలువ వంతెనకు రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. రక్షణ గోడ లేకపోవడంతో రాత్రివేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కాలువ మార్గంలో సాగునీరు ప్రవహించే సమయంలో రోడ్డుపైకి వస్తుందని చెబుతున్నారు. చాలా ఏళ్ల కిందట ఈ వంతెన నిర్మాణం జరిగిందని, ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా ఉందని అంటున్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కాలువ వంతెనకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస నుంచి పురుషోత్తపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో అవధానుల చెరువు వద్దనున్న రహదారి రక్షణ గోడ కూలిపోయి సుమారు 4 నెలలు గడుస్తున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చేసరికి ఒకేసారి మలుపు ఉండి రక్షణ గోడ లేకపోవడం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ధనుంజయరెడ్డికి జాతీయ పురస్కారం ప్రదానం



ఇచ్ఛాపురం రూరల్: పురస్కారం అందుకుంటున్న ధనుంజయరెడ్డి



నందిగాం: మోహనరావుకు పురస్కారం అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి, ప్రముఖ జానపద కళాకారుడు తిప్పన ధనుంజయరెడ్డి జ్ఞాన బుద్ధ జాతీయ పురస్కారం అందుకున్నారు. ఒంగోలులో ఆదివారం జరిగిన తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు–2024 కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించారు. పాతికేళ్లుగా శాస్త్రీయ సంగీతం, జానపద పండారీ భజన, కోలాటం వంటి రంగాల్లో సేవలకు గానూ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు.

పురస్కారం అందుకున్న ధనుంజయరెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి అభినందించారు.

మోహనరావుకు కూడా..

నందిగాం: రంగస్థల, పౌరాణిక, భజన కళారంగంలో చేసిన సేవలను గుర్తిస్తూ నరేంద్రపురం గ్రామానికి చెందిన జీరు మోహనరావుకు తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈయనను పలువురు అభినందించారు.

'పాడి పరిశ్రమపై అవగాహన అవసరం'

ఎచ్చెర్ల: విద్యార్థులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై అవగాహన అవసరమని రీసోర్స్ పర్సన్ బైరి దీషిత అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో పాడి పరిశ్రమ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని కొత్తూరు మండలం పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు దీమా వ్యక్తం చేశారు. అదేవిధంగ పాతపట్నం నియోజవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రెడ్డి శాంతి విజయం ఖాయమన్నారు. ఎన్నికల్లో మహిళలు, గిరిజనులు వైఎస్సార్‌సీపీ వెంట ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి రుణం తీర్చుకున్నారని చెప్పారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు




సర్వే చేపడుతున్న సహిత ఉపాధ్యాయులు

హిరమండలం: మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కె.రాంబాబు తెలియజేశారు. భవిత పాఠశాలలో నిర్వహించు సేవలపై అవగాహన కల్పిస్తూ మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు సహిత ఉపాధ్యాయులు ఎస్.సీన్నాయుడు, గోవిందరావులు తెలిపారు. 18 ఏళ్ల లోపు బడిలో నమోదు కాని సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా వెళ్లి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.

మండల పరిషత్ సమావేశం రేపు

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.త్రివిక్రమరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తి వివరాలతో హాజరవ్వాలని కోరారు.

జంతు సంక్షేమ నియమావళి పాటించాలి



ఉమామహేశ్వరరావు, అదనపు ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తా ఉత్తర్వుల మేరకు ప్రతీ పౌరుడూ జంతు సంక్షేమ సంస్థ నియమావళి పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సోమవారం పత్రికా ప్రకటన విడుదలైంది. ఈ మేరకు జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్ విభాగం) వి.ఉమామహేశ్వరరావుని నియమావళి అమలుపర్చే జిల్లా నోడల్ అధికారిగా ఎస్పీ జి.ఆర్.రాధిక నియమించారు. జిల్లాలో జంతువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. జంతువులను అక్రమంగా తరలించినా, జంతువధకు సంబంధించి సమాచారం ఉన్నా నోడల్ అధికారి ఫోన్ నెంబరు 6309990803కు తెలియజేయాలన్నారు.

సిలబస్ మార్పులపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్నటువంటి టెక్ట్ బుక్స్ సిలబస్‌లో కొన్ని మార్పులు చేర్పులను చేపట్టిందని, వాటిపై ఎమ్మార్సీ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులకు అవగాహన అవసరమని మండల విద్యాశాఖధికారి కె.రాంబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్నటువంటి కొన్ని బుక్స్‌లో సిలబస్‌ను సెమిస్టర్-1, సెమిస్టర్-2 లుగా విభజించారన్నారు. అలాగే సిలబస్‌లో స్వల్ప మార్పులు జరిగాయన్నారు. వాటిని ఉపాధ్యాయులు ముందుగా గమనించాలని సూచించారు.

విద్యార్థులకు కొత్త సిలబస్‌లకు అనుగుణంగా ట్రైటిల్స్ ఇవ్వాల్సింటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యా కానుక డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం



మాట్లాడుతున్న చాయ్ రతన్

నరసన్నపేట: గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి చాయ్ రతన్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి గ్రంథాలయాల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం నిర్వహించిన వేసవి శిబిరంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారికి గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించడం జరిగిందన్నారు. జూన్ 7వ తేదీ వరకూ ఈ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

హిరమండలం: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడడంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరుచూ దిన పత్రికలు చదవడం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి ఎర్రమ్మ పాల్గొన్నారు.

ముత్యాలమ్మా.. కాపాడమ్మా..

- ప్రారంభమైన ఉత్సవాలు
- 9 రోజులపాటు పలు ప్రదర్శనలు
- అలరిస్తున్న విద్యుత్ దీపాలంకరణ



బుట్ట దీపంతో ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్:

ముత్యాలమ్మా..కాపాడమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. నగరానికి గ్రామదేవతగా కాకివీధిలో వెలసిన ముత్యాలమ్మతల్లి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారమభమయ్యాయి. తొమ్మిదేళ్ల తరువాత అమ్మవారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ దమ్మల అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. 2015లో అమ్మవారి పండుగ నిర్వహించామన్నారు. ప్రతీ తొమ్మిదేళ్లకొకసారి ఉత్సవాలు సంప్రదయంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోజూ అమ్మవారికి పసుపు, కుంకుమ పూజలు, ముర్రాట్లతో చల్లదనం, నైవేద్యాలతో పూజలు ఉంటాయని తెలిపారు. తొలిరోజైన సోమవారం ఉదయం అమ్మవారికి ఉపవాసం చెప్పి పండుగలు ప్రారంభించారు. అనంతరం అమ్మవారి దేవరను భక్తులు వీధులలో మేళ తాళాలతో, డప్పుమోతలు, తప్పెటగుళ్ల ప్రదర్శనతో ఊరేగించిన తరువాత దేవరను ఆలయ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉంచారు. ఆలయం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన పెద్ద సెట్టింగు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ అలరిస్తోంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



ముత్యాలమ్మకు ఉపవాసం చెపుతున్న భక్తులు



కళాకారుల డప్పు వాయిద్యాలు

జీడికి మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు

కాశీబుగ్గ: జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని జీడి రైతుల సంఘట జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఏపీ రైతు సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు కోరారు. 80 కిలోల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాశీబుగ్గలోని సీఐటీయూ కార్యాలయంలో జీడి రైతు కృష్ణారావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది పంట కాలంలో వర్షాభావ పరిస్థితులతో పంటను రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జీడి రైతులకు బీమా అమలు చేసి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు టి.భాస్కరరావు, కె.గురయ్య, అంబటి రామకృష్ణ, సీహెచ్ వేణుగోపాల్, ఎం.బాలానందం, టి.సురేష్, బి.మధు, వై.జోగారావు, అర్జి దానేసు, పి.ప్రకాష్, కె.రాజారావు, ఎన్.గణపతి ఉన్నారు.